


# రోడ్డు ఇలా.. పన్ను చెల్లించేదెలా ?

- మేడిపల్లి వద్ద టోల్ గేట్ ప్రారంభం
- ఆర్థిక భారం మోపడంపై వాహనదారుల ఆగ్రహం



మేడిపల్లి టోల్ ప్లాజా వద్ద వాహనాలు



మద్దులపల్లి వద్ద జాతీయ రహదారిపై గుంతలు

కాటారం, అక్టోబర్ 19 : వాహనదారులపై పన్నుల బాదుడుకు మరో 'దారి' సిద్ధమైంది. అసలే గుంతల రోడ్లు.. నిత్యం ప్రమాద ఘంటికలు.. ఇవేమి పట్టించుకోని నేషనల్ హైవే యంత్రాంగం ప్రజలపై మరింత ఆర్థిక భారం మోపేందుకు సిద్ధం కావడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాటారం – భూపాలపల్లి మధ్య మేడిపల్లి వద్ద టోల్ ప్లాజాను శనివారం ఎన్‌హెచ్‌ఏఐ(నేషనల్ హైవే అథార్టీ ఆఫ్ ఇండియా) వరంగల్ పీఐయూ ప్రాజెక్ట్ డైరెక్టర్ దుర్గప్రసాద్, డీఈఈ కుమారస్వామి, ఏఈ ప్రమోద్‌కుమార్, ట్రైనీ ఎస్సై రాజన్‌కుమార్, నిర్వహణ సంస్థ మేనేజర్ ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు.అనంతరం వాహనదారుల నుంచి టోల్ ఫీజును వసూలు చేశారు. కాగా కాటారం నుంచి భూపాలపల్లి జిల్లా కేంద్రం వరకు ఉన్న జాతీయ రహదారి నిత్యం భారీ వాహనాలు, లారీల రద్దీ కారణంగా రోడ్డు దెబ్బతింది. ఈ మార్గంలో అక్కడక్కడా ప్రమాదకరమైన గుంతలు ఉండడంతో వాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతూనే ఉన్నారు. ఈ గుంతలను పూడ్చి ప్రమాదాలను అరికట్టాలంటూ ప్రజా సంఘాలు, వివిధ పార్టీల నాయకులు ఎన్నోమార్లు ఆందోళనలు చేపట్టారు. ఈ నేపథ్యంలో మేడిపల్లి వద్ద టోల్‌గేట్ నిర్మాణానికి అధికారులు పూనుకోగా అభ్యంతరాలు వెల్లువెత్తాయి. ఐనప్పటికీ అధికారులు టోల్‌ప్లాజా ఏర్పాటు చేసి పన్నుల భారం మోపడంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

**అధికారులతో రైతుల వాగ్వాదం**

టోల్‌ప్లాజా విస్తరణ కోసం భూముల సేకరణకు తమకు నోటీసులు ఇస్తూ ఇబ్బందులు పెట్టడంపై రుద్రారం, బస్వాపూర్ గ్రామాలకు చెందిన రైతులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. టోల్‌ప్లాజాకు తమకు జీవనాధారం అయిన విలువైన భూములను ఇవ్వమని తేల్చిచెప్పారు. దీంతో ఎస్సై అభినవ్ అక్కడికి వచ్చి రైతులకు సర్ది చెప్పడంతో ఆందోళన విరమించారు.

**టోల్ వసూళ్లు నిలిపివేయాలని కలెక్టర్‌కు వినతి**

టోల్ వసూళ్లు నిలిపివేసి ముందుగా జాతీయ రహదారి మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని శనివారం కలెక్టర్ రాహుల్‌శర్మకు బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జి జోడు శ్రీనివాస్, యూత్ మండల అధ్యక్షుడు రామిల్ల కిరణ్, జక్కు శ్రావణ్ వినతి పత్రం అందజేశారు. ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా టోల్‌ప్లాజా ఏర్పాటు చేయడం సరికాదన్నారు.

## కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసేందుకు దరఖాస్తులు

భూపాలపల్లి రూరల్ : నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రాం కింద కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేయడానికి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎన్‌సీయూ పెడియాట్రిషన్, పాలీయాటీవ్ కేర్ ఫిజిషియన్, ఎంఎల్‌హెచ్‌పీ (8), డిస్ట్రిక్ట్ క్యాలిటీ అస్యూరెన్సీ మేనేజర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 21 నుంచి 23 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు https://bhoopalapally. telangana.gov.in ను, డీఎంహెచ్‌వో కార్యాలయంలో సంప్రదించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.



















